క్లుప్తంగా

రేపు రక్తదాన శిబిరం

పెదకూరపాడు: రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి సోమయాజులు బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమవుతోందన్నారు. ఆసక్తి గలవారు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆయన కోరారు.

పశు సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ-రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ వై.సుధాకర్ ప్రారంభించి మాట్లాడారు. రైతులు పశు సంరక్షణ పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎదను సకాలంలో గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయించాలని సూచించారు. పచ్చిగడ్డి ప్రాముఖ్యతను వివరించారు. శిబిరంలో 89 గేదెలకు జనరల్, 64 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించినట్లు మాదల పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి శిరీష తెలిపారు. శిబిరంలో పశువైద్యులు అనిల్‌కుమార్, వీరయ్య, పుల్లారెడ్డి, బాలకృష్ణారెడ్డి, తేజస్విని, సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో సరిపడా యూరియా నిల్వలు



తొండపి(ముప్పాళ్ళ): మండలంలో సాగు విస్తీర్ణానికి సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని.. ఎలాంటి యూరియా కొరత లేదని మండల ప్రత్యేకాధికారి రామారావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర మండల యూరియా పంపిణీ పర్యవేక్షణ కమిటీ సభ్యులు మండలంలోని తొండపి, మాదల గ్రామాల్లోని రైతులకు ఎరువుల వాడకంపై బుధవారం అవగాహన కల్పించారు. రైతులు నానో యూరియా వాడకంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీవో పి.రత్నం, మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించాలి



నకరికల్లు: మండలంలోని గ్రామ సచివాలయాల విద్యుత్ బకాయిలు పెద్ద సంఖ్యలో పేరుకు పోయాయి. మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీలకు కలిపి రూ.85.42 లక్షల బకాయిలు పేరుకుపోయాయి. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలు చెల్లించాలని కోరుతూ డిప్యూటీ ఎంపీడీవో కేవీ శివప్రసాద్‌కు విద్యుత్‌శాఖ తరఫున బుధవారం వినతిపత్రం అందజేశారు. సత్వరమే బిల్లులు చెల్లించకుంటే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అధికారికి నోటీసులు ఇచ్చినట్లు సమాచారం.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



అచ్చంపేట: కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పద్మ అన్నారు. మండలంలోని వేల్పూరు జిల్లా పరిషత్ హైస్కూలులో బుధవారం జరిగిన కిశోర బాలికల అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని బాలికలకు సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాణిక్యమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఉపాధ్యాయులు రాణి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

రెంటచింతల: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ నాగార్జున తెలిపిన వివరాలు.. రెంటచింతల రేంజ్ బజారు నివాసి, అధ్యాపకుడు జనార్దనరావు గత నెల 2న భార్య సుమతిగ్రేస్‌తో కలిసి మాచర్ల వెళ్లారు. రెండు రోజుల తర్వాత ఇంటికి రాగానే చోరీ జరిగినట్లు గుర్తించారు. 123 గ్రాము బంగారం ఆభరణాలు, రూ.20 వేలు అపహరణకు గురైనట్లు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు విచారించిన క్లూస్ టీంకు జెట్టిపాలేనికి చెందిన తమ్మిశెట్టి సాయి కుమార్ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి గురజాల కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పేదలకు అందని కందిపప్పు!

- కందిపప్పు కోసం ఏడాదిగా లబ్ధిదారుల ఎదురుచూపులు
- గత ప్రభుత్వంలో నిరంతరాయంగా సరఫరా



చౌక ధరల దుకాణంలో సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

అమరావతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు అందించే నిత్యావసర సరుకుల్లోనూ కోత విధిస్తోంది. చౌక ధరల దుకాణాల్లో కందిపప్పు నిలిపివేయడంతో ఏడాది కాలంగా కందిపప్పు సరఫరా కోసం కార్డు దారులు ఎదురుచూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రేషన్ దుకాణాల్లో బియ్యం, కందిపప్పు, చక్కెరను లబ్ధిదారులకు అందించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కందిపప్పు సరఫరాను నిలిపివేయడంతో పేదలు బయట దుకాణాల్లో అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారు. బయట దొరికే కందిపప్పు ధరతో పోటీ పడలేకపోతున్నామని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

బయట దుకాణాల్లో అధిక ధరకు..

ప్రస్తుతం నిత్యావసరాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కందిపప్పు రేషన్ షాపుల్లో దొరకకపోవడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలపై అధిక భారం పడుతోంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో కందిపప్పు రూ.110 నుంచి రూ.130 అమ్ముతున్నారు. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు కందిపప్పు కొనలేని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం సరఫరా చేసిన విధంగా ప్రతి కార్డు దారుడికీ కిలో కందిపప్పు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

హామీలకు తిలోదకాలు..



రేషన్ షాపుల్లో కందిపప్పు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీకి తిలోదకాలు వదిలింది. అధికారంలోకి వచ్చాక హామీని మరిచిపోయారు. నిత్యావసర సరుకు అయిన కందిపప్పు రేషన్ కార్డుదారులకు అందించడం ప్రభుత్వ బాధ్యతగా తీసుకోవాలి. పేదలకు వెంటనే కందిపప్పును రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయాలి.

అళ్ల శివలక్ష్మీ కుమారి, వైస్ ఎంపీపీ, అమరావతి

కందిపప్పు రావడం లేదంటున్నారు..



ఏడాదిగా కందిపప్పు రేషన్ కార్డు వినియోగదారులకు ఇవ్వడం లేదు. ప్రభుత్వం రేషన్ షాపుల్లో బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు అడిగితే పైనుంచి రాలేదని డీలర్లు చెబుతున్నారు. గతంలో కిలో కందిపప్పు రూ.70 ఇచ్చేవారు. దీంతో పేదల కుటుంబాలకు కొంత ఊరటగా ఉండేది. ప్రభుత్వ పెద్దలు చొరవ చూపి పేద కుటుంబాలకు రేషన్‌షాపులలో కందిపప్పు పంపిణీ చేయాలి.

సయ్యద్ మొహిద్దీన్, మునగోడు, అమరావతి

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి



సీహెచ్‌సీలో జ్వర బాధితుడిని పరీక్షిస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి రవి

అమరావతి: 'విజృంభిస్తున్న విషజ్వరాలు' శీర్షికన ఈనెల 5న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి స్పందించారు. దీంతో స్థానిక సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వార్డులలో ఇన్‌పేషెంట్‌లను పరీక్షించి వారికి ఉన్న ఆరోగ్య సమస్యలను, అందుతున్న చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రవి కుమార్‌ను ఆసుపత్రికి వచ్చే జ్వరపీడితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ రవి వైద్యాధికారుల బృందంతో అమరావతి-1 సచివాలయ పరిధిలోని పలు గృహాలను సందర్శించి పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలను పరిశీలించారు. నీటిలో లార్వా లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమాల్లో అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్న కుమార్, సీఎల్‌పీ వైద్యాధికారి మౌనిక, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, ఆరోగ్య విస్తరణ అధికారి, ఒ.లక్ష్మీ మనోహర్, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎస్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నవజాత శిశువు మరణాలను తగ్గించాలి



పీహెచ్‌సీ ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి రమాదేవి

ముప్పాళ్ళ: నవజాత శిశువు మరణాలను తగ్గించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి తెలిపారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నవజాత శిశువు మరణాలను తగ్గించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆమె వివరించారు. హైరిస్క్ ఉన్న గర్భిణులకు డెలివరీ వరకు ఉచిత మందులు, ఉచిత స్కానింగ్, వైద్య పరీక్షలు నిర్వహించనున్నామని అన్నారు. ప్రతి నెలా 9, 10, 15, 20, 25 తేదీల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దస్తగిరి, సూపర్‌వైజర్‌లు పీటర్‌డేమియన్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తు ఫాం విడుదల చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: పేద ఆర్యవైశ్య విద్యార్థుల చదువుకు సహాయపడేలా మండవ సీతారామాంజనేయులు జయశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు అందచేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ సీతారామాంజనేయులు బుధవారం తెలిపారు. ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కాలర్‌షిప్ దరఖాస్తులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏడు సంవత్సరాలుగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 101 మంది ప్రతిభ గల పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2 వేలు చొప్పు న అక్టోబర్ 11వ తేదీన శ్రీ సీతారామస్వామి దేవాలయంలో అందచేస్తామని వివరించారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా తమ దరఖాస్తులను పూర్తిచేసి అందివ్వాలని తెలిపారు. వివరాలకు 9490087779, 9246453348 నెంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీవాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, మండవ పూర్ణచంద్రరావు, పెనుగొండ ప్రభాకర్ పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్‌లు పంపిణీ



రాజుపాలెం: క్షయ వ్యాధిగ్రస్తులు పౌష్టిక ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధి త్వరగా తగ్గుతుందని డాక్టర్ రవితేజ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 20 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్‌లను బుధవారం అందించారు. ఈ పౌష్టికాహార కిట్‌లను క్యూబ్‌హైవేస్ ఫౌండేషన్ సహకారంతో అందించినట్లు డాక్టర్ తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు టీబీ మందులు వాడుతున్నంత వరకు పౌష్టిక ఆహార కిట్‌లను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్రోసూరు టీబీ యూనిట్ పర్యవేక్షకులు సౌజన్య, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, హెల్త్ విజిటర్ ఉషారాణి, రమాదేవి, శివ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైద్యుడు మృతి



సత్తెనపల్లి: సత్తెనపల్లిలో నివసిస్తున్న డాక్టర్ బత్తుల శివరామకృష్ణ(38) గుండెపోటుతో మంగళవారం ఏలూరులో మృతి చెందారు. ఏలూరు వైద్య కళాశాలకు చెందిన ఆశ్రమంలో జనరల్ ఎండీగా ఆయన సేవలు అందిస్తున్నారు. మృతుడికి తల్లిదండ్రులు హనుమంతరావు, సోమమ్మ, సోదరుడు ఉన్నారు. అందరితో సౌమ్యంగా, ఎప్పుడూ చిరునవ్వుతో పలకరిస్తూ ఉండే డాక్టర్ శివ రామకృష్ణ మృతి చెందారన్న వార్త అందరినీ కలచివేసింది. శివరామకృష్ణ పార్థివదేహాన్ని బుధవారం స్వగ్రామమైన ముప్పాళ్ళ మండలం ఇరుకుపాలెం గ్రామానికి తీసుకువచ్చారు.

పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అమరావతి సేవా సమితి బాధ్యులు

సత్తెనపల్లి: నిప్పు కణిక, వీర వనిత చాకలి ఐలమ్మ తన పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిందని అమరావతి సేవా సమితి అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా అమరావతి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి భూస్వాములు, రజాకార్లను ఆమె తరిమికొట్టిందన్నారు. పేదల బతుకుల విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని రగిల్చిన అగ్నికణం చాకలి ఐలమ్మ అని కొనియాడారు. అనేక మందికి విప్లవ భావాలు మండించిన నిప్పుల కొలిమి ఐలమ్మ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు నాగమలేశ్వరావు, షారోన్‌కుమార్, బబ్బు, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



అవగాహన కార్యక్రమంలో ఏడీఏ రవిబాబు

సత్తెనపల్లి: రైతులు పంటల సాగుకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల ది ఆంధ్రా బ్యాంక్ రైతు సేవా సహకారం సంఘం భవన ఆవరణలో రైతులకు యూరియా వాడకంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు అవసరం మేరకు ఎరువులను కొనుగోలు చేసుకుని వాడాలని సూచించారు. రైతులందరికీ అందుబాటులో ఎరువులను ఉంచుతామన్నారు. సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. అవసరం మేరకు రైతులందరికీ ఎరువులను పంపిణీ చేయనున్నామని అన్నారు. అనంతరం ధూళిపాళ్ల ఏబీఎఫ్ఎస్‌సీఎస్ ఎరువుల పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో గ్రామ స్థాయి అవుట్ రీచ్ బృందం, రైతులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు గృహహింస నిరోధక చట్టం దోహదం

జిల్లా గృహహింస నిరోధక చట్టం సోషల్ కౌన్సిల్ సంగీత



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంగీత

సత్తెనపల్లి: మహిళల రక్షణకు గృహహింస నిరోధక చట్టం దోహదపడుతుందని జిల్లా గృహహింస నిరోధక చట్టం సోషల్ కౌన్సిల్ సంగీత అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా మహాసభను సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో కళ్ళం మునెమ్మ ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. సభకు ఐద్వా నాయకురాలు గద్దె ఉమాశ్రీ అధ్యక్షత వహించారు. సంగీత మాట్లాడుతూ.. నేటికీ మహిళలపై హింస కొనసాగుతూనే ఉందన్నారు. ఈ నేపథ్యంలో 2006లో ఐక్యరాజ్యసమితి వారు 'అన్ని రూపాల వివక్షత నిర్మూలన సదస్సును' ఏర్పాటు చేసి ఆ సదస్సులో మహిళల రక్షణకు గృహహింస నిర్మూలన చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్టు సీడీపీవో టి.శ్రీలత మాట్లాడుతూ.. నేటికీ సమాజంలో బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.రాధాకృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీనివాస్ కుమారి, ఐద్వా జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల వీర బ్రహ్మం, సీహెచ్ నాగేంద్రమ్మ, ఐద్వా మహిళా నాయకులు, రైతు సంఘం నాయకులు బొల్లేపల్లి రామారావు, మక్కపాటి నరసింహారావు, కౌలు రైతు సంఘం నాయకులు పెండ్యాల మహేష్, డీవైఎఫ్ఐ నాయకులు జె.భగత్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

క్రోసూరు: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ప్రతినిధి జ్యోతి తెలిపారు. బుధవారం క్రోసూరులోని సచివాలయాలు, పలు కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ఎయిడ్స్, ఎస్‌టీఐ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకయ్య, అంగన్‌వాడీ వర్కర్స్, ఆశా, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సిబ్బంది, హెచ్‌సీటీఐ ప్రతినిధులు నాగలక్ష్మీ, ఈశ్వర్, రాణి, రామ, ఎస్తేరు, నాగూర్, శాంతకుమారి, సుజాత, లక్ష్మీబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపకూడదు

సత్తెనపల్లి: హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు చూడకుండా సమాజంలో అందరూ కలిసి జీవించాలని హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ సంస్థ వారి ఆధ్వర్యంలో కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు కరపత్రాల ద్వారా బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఔట్రీచ్ వర్కర్స్ నాగలక్ష్మీ, ఈశ్వర్, జ్యోతి, రాణి, రామ, ఎస్తేరు, నాగూర్, శాంత కుమారి, సుజాత, లక్ష్మీబాయి, విజయ కుమారి, ప్రసన్న, ఉన్నారు.

ప్రతి యూరియా బస్తా వివరాలు నమోదు చేయాలి



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న జగ్గారావు

నకరికల్లు: విక్రయించిన ప్రతి యూరియా బస్తా వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు ఆదేశించారు. మండలంలోని దేచవరం గ్రామంలోని ఎరువుల దుకాణాల్లో ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. డీలర్‌లు ఎరువుల కొనుగోలు వివరాలు, స్టాక్ రిజిస్టర్, రసీదు పుస్తకాలు, విక్రయ రసీదులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల క్రయవిక్రయాల వివరాలు ఐఎఫ్ఎంఎస్ పరికరంలో పొందుపరచాలన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా రైతులకు కావాల్సిన యూరియాను రెండు రోజుల్లో సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

చదువే ఎదుగుదలకు తోడ్పాటు

దాచేపల్లి: నిరుపేద కుటుంబంలో పుట్టిన తాను పట్టుదలతో చదువుకోవటం వల్లే ఈ స్థాయికి చేరుకున్నట్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నాగెండ్ల యేసయ్య అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి ఎస్టీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న యేసయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు యేసయ్యను బుధవారం ఘనంగా సన్మానించారు. యేసయ్య మాట్లాడుతూ.. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును పొందటం ద్వారా విధి నిర్వహణలో తన బాధ్యతను మరింతగా పెంచిందన్నారు.

ఎన్ఆర్ఐ అనిల్ కుమార్ సేవలు ఎనలేనివి

సత్తెనపల్లి: అమరావతి మండలం ఉంగుటూరుకు చెందిన గుండవరపు అనిల్ కుమార్ ఉద్యోగ రీత్యా విదేశాల్లో స్థిరపడినప్పటికీ పేదలకు ఆయన అందిస్తున్న సేవలు ఎనలేనివని పలువురు వ్యక్తులు కొనియాడారు. పట్టణంలోని ఫణిదం చేనేత సహకార సంఘం భవన ఆవరణలో బుధవారం 75 పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు, ఇరువురు పేద విద్యార్థులకు రెండు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ గత 14 ఏళ్ల నుంచి స్వగ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు కొనియాడి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఏపీపీ బగ్గి నరసింహారావు, కట్టా శివదుర్గారావు, గంజి వీరాస్వామి, దివ్వెల శ్రీనివాసరావు, అవ్వారు రవీంద్రనాథ్ ఠాగూర్, కొత్రపు శ్రీనివాసరావు, కొతారు సంధ్య, వలేటి కుమారి, కర్నాటి మురళి, కంచర్ల నాగేశ్వరరావు, గంగూరి కల్యాణ్, గంగూరి సోమనాథ్, తదితరులు ఉన్నారు.

అవసరం మేర ఎరువులు వాడాలి



బెల్లంకొండ: రైతులు ఎరువులను వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వాడాలని మండల వ్యవసాయ అధికారి అరుణ కుమారి తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది భూసార పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. భూసార పరీక్షల ద్వారా అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు వేయాలని తెలిపారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను అధికంగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

మాచర్ల: పురపాలక సంఘ పరిధిలో మున్సిపల్ చైర్మన్ ఆదేశాల మేరకు పట్టణంలో అన్ని వార్డుల్లో కాలువల్లో పేరుకు పోయిన మురుగును పారిశుద్ధ్య కార్మికులు బుధవారం తొలిగించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మునిసిపల్ కమిషనర్ డి.వేణు బాబు 50 రోజుల్లో 17 మంది అదనపు సిబ్బందిని సహకారంతో మురుగు కాలువల్లో పూడిక తీత, పారిశుద్ధ్యం చర్యలు చేపట్టారు. దోమల వ్యాప్తిని కట్టడి చేసేలా తగు చర్యలు తీసుకున్నారు. ఇళ్ల ముందు చెత్త నిల్వలు లేకుండా పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి తొట్టెల్లో, పాత టైర్లు, గుంతల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

డీఎస్పీ జగదీష్

గురజాల: ఈ నెల 13వ తేదీ నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ బి.జగదీష్ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్, మోటారు వాహనాలు, బ్యాంకు కేసులు వంటివి ఏమైనా కేసులు ఉంటే వెంటనే అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చన్నారు. రాజీ మార్గమే రాజమార్గమని సూచించారు. కార్యక్రమంలో సీఐ భాస్కర్, ఎస్ఐలు వై.వినోద్ కుమార్, బి.అనంత కృష్ణ ఉన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టులో సత్తెనపల్లి

HMOP 95/ 2024

బిట్వీన్:

తమ్మిశెట్టి కుమారి భర్త బాబు

తండ్రి చల్లా వీరభద్రరావు డోర్ నెంబరు: 3-4, మెయిన్‌రోడ్డు, చెరుకుపాలెం గ్రామం, అచ్చంపేట మండలం, పల్నాడు జిల్లా.

-పిటీషనరు

మరియు

తమ్మిశెట్టి బాబు తండ్రి వెంకయ్య, డోర్ నెంబరు: 4-6, వడ్డెర కాలనీ, దొడ్లేరు గ్రామం, క్రోసూరు మండలం, పల్నాడు జిల్లా.

-రెస్పాండెంటు

పై నెంబరు ఓ.పి.లో మీకు ఎన్నిసార్లు బేటాలు కట్టినా మీరు అదే అడ్రసులో వుంటూ కోర్టు నోటీసులు తీసుకొనడం లేదు. కావున శ్రీ కోర్టు ఉత్తర్వుల ప్రకారం మీ కేసు 17-9-2025 కు వాయిదా వేసియున్నారు. కావున మీరు తేది 17-9-2025 న గౌరవ కోర్టు వారి ఎదుట ఉ॥ 10:30 ని॥లకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానం జరుగును.

"కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం"

సత్తెనపల్లి.

వాయిదా తేది: 17-9-2025

బగ్గి నరసింహారావు, వాది తరపు న్యాయవాది, సత్తెనపల్లి.